# మగని చెవిలో

'అనసూయ.'

(దినచర్య గురించి)

ఏమండీ! అంత చిరాకు! నిద్ర లేకుండా నేను చేస్తున్నానా, మీరు చేసుకుంటున్నారా? ఆ పాడు క్లబ్బుకు వెళ్లడం కొంచెం తగ్గించకూడదూ! పోనీ, వెళితే వేగం రాకూడదా? ఔనుగాని తెలియక అడుగుతాను, ఏమిటిచేస్తారు అక్లబ్బులో? రోజూ చూచుకొనేమొగాలేనా మరెవరైనా కొత్తకొత్తఅమ్మాయిలు వస్తూవుంటారా? అలాంటిదేమీ లేదూ? మరేమిటి ఉంటుంది? పేకాటా, బాతాఖానీ, అంతేనా? పేకాట డబ్బువేసే ఆడతారా? రోజుకేపాటి మీరు పేకాటలో సంపాదన! ఎప్పుడూ నష్టమేనా! మీమనఃఖానికి మరొక తెలాగవుతుంది!

అయితే, పేకాట లాడడానికి డబ్బుందీ? నేనడిగితేమాత్రం ధుమధుమలూ, రొసరొసలూనా! ఏమైనాఅంటే సణిగేవంటారు గాని రోజుకి అధమం అర్ధరూపాయి నష్టపోతూఉంటే, నెలకు పదిహేనురూపాయిలు ఎవరు తిన్నసొమ్ము! మీరు తగలపెట్టడం బాగుందీ! అది మరి లెక్కలేదు! నేనడిగితే మాత్రం డెబ్భైపదకొండు ప్రశ్నలువేసి లేదు లేదని గునిసిగునిసి ఆఖరికి అడిగినదానిలో ఆరోవంతు యివ్వడం అబ్బురమైపోవడమూ!

పోనీ, నేనే తినేస్తున్నానా? నేనేం బట్టలూ పాతలూ నగలూ నాణెములూ కొనేసి పెట్టేసుకొని విర్రవీగేటందుకు అడుగుచున్నానా? మీ యింటిఖర్చుకు, మీ పిల్లలఖర్చుకు అడుగుచున్నాను గాని నేనేం మాపుట్టింటివారికి పెట్టివేయలేదే! నామీద ఎందుకంత అనుమానం? కాటు వేసే పెళ్లాలలాగు నేనూ చేస్తూఉంటే మీకు బాగుండునుగాని నాకు అలాంటి గుణము లేదుగదా అని నన్ను యిలాగు యేడిపించుచున్నారు! యిది మీకు బాగానే ఉందీ? పోనీయండి! మొన్న శ్రావణమాసానికి ఒక్కకాసైనా కొన్నారూ? నాకేం బంగారంవస్తువులు కావాలనికాదు గాని అది లోకలాంఛనంగనుక అన్నాను. ఒకనెల పేకాట మానేస్తే బాగుండేదే! లక్ష్మి పూజకు బుద్ధిపుట్టదుగాని పేకాటకు పిడుగులు!

అయితే యిప్పుడెందుకీ ఘోష అర్ధరాత్రప్పుడు అని అంటారా? బాగున్నది. మీకు మాట్లాడడానికి పెళ్లాముమాటలు చెవుల పట్టించడానికి వేళయేదీ? పిల్లలు బడి నుండి వచ్చేవేళకు నిద్రలేస్తారు. పార్టీలతో గంట మాట్లాడేసరికి కోర్టువేళయిపోతుంది. లక్కడేదో పని మునిగిపోయినట్లు ఒక రోజైనా తప్పకుండా కొంచెము ఆలస్యమైనా కాకుండా మెతుకులు నోట్లో ఉండ

గానే పరుగెత్తి వెళ్లిపోతారు! అంతపనే ఉంటూఉంటే మరి యీ దరిద్రమేమిటి? అవునుగాని మాబంట్రోతు గుంటడు అంటాడు:—మీరూ తక్కినప్లీడర్లూ కచేరీలో ఉండక ఏదో మూలగదిలో కేకలేసుకుంటూ చుట్టలు సిగరెట్లు కాల్చుకుంటూ కూర్చుంటారట! కాఫీరాగానే ముగ్గురు నలుగురు అతుకడితాగేసి బాతాఖానీ కొట్టేసి మళ్లీ కచేరీనుండి వెళ్లిపోవస్తారట! నిజమేనా?

వాడిమొగం వాడికేమితెలుసునా! ఎంత చిన్నగుండైనా రోజూచూచినది చెప్పలేడా? కచేరీనుండిరాగానే షికారు; షికారునుండి క్లబ్బు; క్లబ్బునుండివచ్చేసరికి తొమ్మిదిగంటల రాత్రి! యీలోపల పిల్లలు నాప్రాణాలు తీసివేయడము! తిళ్లు పూర్తిఅయి ప్రక్కకు చేరేసరికి పదకొండుగంటలు అవుతుందిగదా! మరెప్పుడు సమయం మీకు వినడానికీ నాకు చెప్పడానికీ, అర్ధరాత్రప్పుడు ఘోషపెట్టే నంటే నాతప్పా మీతప్పా?

అసలు నాఘోష యింతకూ మీరువింటే గదూ! పిసరుతీరుబాటువుంటే నోవలు పట్టుకొంటారుగదా! ఏమిచెప్పినా, ఏమి మొత్తుకున్నా, 'ఊఁ,' 'ఊఁ' అనడమేగాని చెప్పినదానిమీద ధ్యానమేమైనఉందీ? అంతా బాగుందిగాని అల్లుడికి అలగడమే పిశాచ గుణమన్నట్లు ఆ 'ఊఁ' 'ఊఁ' అని నీరుకార్చడమే బాగుండలేదు. అది విన్నట్లూకాదు, విననట్లూకాదు. ఇదిమంచి, ఇదిచెడ్డ, అని కట్టుకొన్నపెళ్లాంతో కాస్తసేపు మాట్లాడడానికి టైములేదా లేక ఆసక్తిలేదా? అప్పుడే నిద్రపట్టిపోయిందీ! కానియ్యండి, కానియ్యండి.

---

## చలోక్తులు

చలోక్తులతో ప్రతికక్షులను మాడ్చివేయుటలో లాయడ్ జార్జివంటి ప్రవీణుడు నేడు గానరాడు. ఒకమారాతడొక ఎన్నికలసభలో నుపన్యసించుచుండగా నొకసభికుడులేచి "లాయిడు జార్జిగారూ! తమ తాతగారు గాడిదబండిని తోలువాడను సమాచారం మరచారా?" అని యుక్తిగా ప్రశ్నించెను. జార్జి ఒకనిముషమాగి ఉపన్యాసమును ప్రారంభించుచు, "సభికులారా! క్షమింపుడు; నామదినుండి ఆబండి యిపుడు దూరమైనది; గాని ఆగాడిదమాత్ర మింకను జీవించియే యున్నది" అనెను. సభికులందరు కడుపు చెక్కలగునట్లు నవ్విరి. ప్రశ్నించినవాడసహాయుడై కూలబడెను.

---

మరొకమారాత డుపన్యసించుచుండ నొక సభికురాలులేచి కోపముచే, "నేను మీభార్యనైతే మీకు విషమిస్తాను" అనెను. లాయడ్ జార్జి నవ్వుచు "మేడమ్! నీవు నాభార్యఅయితే నేనావిషం పుచ్చుకుంటాను." అని బదులిచ్చెను. తరువాత ఆస్త్రీ యెపుడును అతని యెదిరించి మాట్లాడలేదట.